క్లుప్తంగా

వైఎస్సార్ సీపీ ముస్లిం మైనార్టీ పట్టణ అధ్యక్షుడిగా జానీ


సయ్యద్ కరీం(జానీ)

పెద్దాపురం: పట్టణ వైఎస్సార్ సీపీ ముస్లిం మైనార్టీ అధ్యక్షుడిగా సయ్యద్ కరీం(జానీ) నియమితులయ్యారు. తనపై నమ్మకంతో బాధ్యతను అప్పగించిన పార్టీ అధినేత వైఎస్ జగన్మోహన్‌రెడ్డి, నియోజకవర్గ కో–ఆర్డినేటర్ దవులూరి దొరబాబుకు మంగళవారం ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా జానీని ముస్లిం అంజుమన్ కమిటీ సభ్యులు సయ్యద్ ఖాదర్, మక్బుల్ జానీ, ముస్తఫా, షరీఫ్ మాస్టర్ తదితరులు అభినందనలు తెలిపారు.

పట్టణ మహిళా అధ్యక్షురాలిగా కుసుమ


దొరబాబుకు కృతజ్ఞతలు తెలుపుతున్న కుసుమ

సామర్లకోట: వైఎస్సార్ సీపీ పట్టణ మహిళా అధ్యక్షురాలిగా పాలిక కుసుమను నియమించినట్టు పార్టీ నియోజకవర్గ కో–ఆర్డినేటర్ దవులూరి దొరబాబు తెలిపారు. ఈ నేపథ్యంలో మంగళవారం ఆమె దొరబాబును కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ ఉబా జాన్‌మోజెస్, కౌన్సిలరు మర్రి శేషారావు, పాలిక చంటిబాబు తదితరులు పాల్గొన్నారు. పార్టీ అభివృద్ధికి కృషి చేస్తానని కుసుమ తెలిపారు. ఇప్పటికే నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలిగా సేపెని రూప నియమితులయ్యారు.

వైఎస్సార్ సీపీ నియోజకవర్గ యూత్ ప్రెసిడెంట్‌గా వీరంరెడ్డి


వీరంరెడ్డి వెంకయ్య

సామర్లకోట: పెద్దాపురం నియోజకవర్గ వైఎస్సార్ సీపీ యూత్ ప్రెసిడెంట్‌గా వీరంరెడ్డి వెంకయ్య(నాని) నియమితులయ్యారు. ఈ మేరకు మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి నుంచి ఉత్తర్వులు వచ్చాయని పార్టీ నియోజకవర్గ కో–ఆర్డినేటర్ దవులూరి దొరబాబు తెలిపారు. ఈ మేరకు మంగళవారం నాని ఈ విషయాన్ని విలేకర్లకు తెలిపారు. అదేవిధంగా సోషల్ మీడియా నియోజకవర్గ కన్వీనర్‌గా వారా సుధాకర్‌ను నియమించినట్లు దవులూరి దొరబాబు తెలిపారు.

రైతుల అభివృద్ధికి కృషి


సునీల్ కుమార్


సత్యానంద రెడ్డి

కొత్తపల్లి: రైతుల అభివృద్ధి, సంక్షేమానికి కృషి చేస్తున్నామని పీబీసీడీసీ–1, పీబీసీడీసీ–2 చైర్మన్లు మురాలశెట్టి సునీల్‌కుమార్, అనిశెట్టి సత్యానందరెడ్డి అన్నారు. మంగళవారం పీబీసీడీసీ చైర్మన్లు ప్రమాణ స్వీకారం చేశారు. వారిని పలువురు అభినందించారు.

దుప్పట్ల పంపిణీ

పిఠాపురం: నియోజకవర్గం ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం రాత్రి పిఠాపురంలో యాచకులకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అసోసియేషన్ నాయకులు మాట్లాడుతూ పే బ్యాక్ టు ది సొసైటీ పేరుతో పిఠాపురం నియోజకవర్గంలో ఎవరికి ఏ కష్టం వచ్చినా తాము ముందుంటామన్నారు. అసోసియేషన్ నాయకులు చామంతి నాగేశ్వరరావు, అధికారులు పాల్గొన్నారు.

సాగులో ఖర్చు ఆదా

- బెంగాలీ నాట్లతో రైతులకు తగ్గుతున్న భారం
- విత్తనాలు, నారు, పెట్టుబడి తక్కువే
- కూలీల పనిపై ఆసక్తి
- నియోజకవర్గంలో 12 వేల హెక్టార్లలో పంట సాగు


వాకతిప్పలో బెంగాలీ కూలీలు వేసిన వరి నాట్లు

కొత్తపల్లి: అందరూ ఒకేసారి పనులు చేపట్టడంతో వ్యవసాయంలో కూలీల కొరత ఎక్కువగా ఉంది. ఈ సమయంలో బెంగాలీ కూలీలు రావడంతో కొంత వరకూ ఉపశమనం లభిస్తోంది. బెంగాలీ కూలీలు తక్కువ నారుతో తక్కువ సమయంలో తక్కువ మందితో వేగంగా నాట్లు వేస్తున్నారు. వీరు పది నుంచి 12 మంది గ్రూపుగా ఉండి రోజుకు ఐదు నుంచి 6 ఎకరాల నాట్లు వేస్తున్నారు. రైతులకు పెట్టుబడి ఖర్చులు తగ్గుతున్నాయి. ఫలితంగా పిఠాపురం నియోజకవర్గంలో రైతులు బెంగాలీ కూలీలతో నాట్లు వేయించేందుకు ఆసక్తి చూపిస్తున్నారు. రైతులకు వ్యవసాయ శాఖ కూడా బెంగాలీ తరహాలో నాట్లు వేస్తే తెగుళ్ల బెడద తక్కువగా ఉంటుందని చెబుతున్నారు. దీంతో రైతులు బెంగాలీ కూలీలను తీసుకొస్తున్నారు. ఇప్పటికే జట్లుగా వచ్చిన బెంగాలీలు నియోజకవర్గంలో పలు గ్రామాల్లో స్థావరాలు ఏర్పాటు చేసుకుని కాంట్రాక్టు ప్రాతిపదికన రైతులతో మాట్లాడుకుంటున్నారు. మండలంలో ఇప్పటికే 10 శాతం బెంగాలీ కూలాలు నాట్లు వేశారు. నియోజకవర్గంలో కొత్తపల్లి, పిఠాపురం, గొల్లప్రోలులో సుమారు 12 వేల హెక్టార్లలో వరి పంట సాగు జరుగుతుంది. కొత్తపల్లి మండలంలో సుమారు 6,150 మంది రైతులు 10,154 ఎకరాల్లో ఖరీఫ్ వరి సాగు చేస్తున్నారు.

లేత నారుతోనూ నాట్లు

రైతులు గతంలో ఎకరానికి 25 కిలోల విత్తనాలు నారు కోసం వినియోగించేవారు. బెంగాలీ కూలీల రాకతో ఎకరానికి సుమారు 15 కిలోలు విత్తనాలు మాత్రమే వినియోగిస్తున్నారు. లేత నారుతోనే నాట్లు వేయగలరు. వీరు వేసిన నాట్లు నాలుగైదు రోజుల్లో మూనలు తీరుగుతాయి. స్థానిక కూలీలు వేసిన నాట్లు మూనలు తిరగాలంటే పది రోజులు పడుతుంది. నాట్లకు స్థానిక కూలీలు ఆరుగురు అవసరైతే బెంగాలీ నలుగురు సరిపోతారు. వీరు ఎకరానికి 15 నుంచి 20 పోగుటు వాడితే స్థానికులు 45 పోగులకుపైన వినియోగిస్తారు. స్థానికులతో పోలిస్తే బెంగాలీ నాట్లు వల్ల రైతులకు ఖర్చులు చాలా వరకు తగ్గుతోంది. దిగుబడి అధికంగా వస్తుస్తోందని రైతులు చెబుతున్నారు.

పెరిగిన దిగుబడి

ముడేళ్లుగా బెంగాలీ కూలీలతో నాట్లు వేయిస్తున్నాను. వారు నేర్పుగా నాట్లు వేస్తారు. ఫలితంగా ఖర్చు తగ్గింది. చీడ పీడల బెడద తగ్గింది. ఎకరానికి దిగుబడి పెరిగింది. స్థానిక కూలీల కొరత తగ్గింది.

– మేడిది అప్పారావు, రైతు, వాకతిప్ప

మూడొంతుల ఖర్చు తగ్గింది

బెంగాలీ నాట్లు విధానం చాలా బాగుంది. ఖర్చు విషయంలో ఆదిలోనే మూడొంతులకుపైగా తగ్గిపోయింది. బెంగాలీ విధానంలో పూర్తిగా నారు కొరతను తగ్గించవచ్చు. ఎక్కువ మంది కూలీలతో పనిలేదు. ఎక్కువ మంది రైతులకు బెంగాలీ నాట్లపై అవగాహన కలిగింది.

– పెద్దిముడి సతీష్, రైతు, వాకతిప్ప

నాట్లు త్వరగా పూర్తి చేయాలి



రైతులు వరినాట్లను నెలాఖరు నాటికి పూర్తి చేసుకోవాలి. నియోజకవర్గంలో 60 శాతం బెంగాలీ కూలీలతో నాట్లు వేయిస్తున్నారు. బెంగాలీ నాట్ల వల్ల సాగు ఖర్చులు తగ్గడంతోపాటు పురుగు మందుల వాడకమూ తగ్గుతుంది. దీంతో ఎక్కువ మంది రైతు బెంగాలీ వైపు మొగ్గు చూపుతున్నారు. రైతులకు ఎప్పటికప్పుడు పంటల సాగుపై సలహాలను అందిస్తున్నాం. ఏ సమయంలో ఎంత మోతాదులో మందులను ఉపయోగించాలో తెలియజేస్తున్నాం. వ్యవసాయంలో రైతులు అధికారుల సూచనలు, సలహాలను పాటించాలి.

– కె.సత్యనారాయణ, మండల వ్యవసాయ అధికారి, గొల్లప్రోలు

పవరలో రెవెన్యూ సదస్సు


రెవెన్యూ సదస్సులో అర్జీ అందజేస్తున్న మహిళా రైతు

సామర్లకోట: రైతుల సమస్యలు పరిష్కరించుకోవడానికి రెవెన్యూ సదస్సులు దోహదపడతాని తహసీల్దార్ కొవ్వూరి చంద్రశేఖరరెడ్డి అన్నారు. మండలంలోని పవర గ్రామంలో మంగళవారం జరిగిన రెవెన్యూ సదస్సుకు ఆయన అధ్యక్షత వహించారు. భూ సమస్యలపై రెవెన్యూ అధికారులే రైతుల వద్దకు వస్తున్నారన్నారు. రెవెన్యూ సదస్సులో ఏడు అర్జీలు వచ్చాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో రీ సర్వే డిప్యూటీ తహసీల్దార్ వై.శ్రీనివాసు, మండల సర్వేయర్ పి.సీతారామాచార్యులు, గ్రామ సర్వేయర్లు సీహెచ్ నరసింహమూర్తి, వీరంరెడ్డి ఆనంద్, ఎ.సంజీవ్, భరత్, టి.సాయిరాం, వీఆర్వోలు పాల్గొన్నారు.

21న మండల సమావేశం

సామర్లకోట: మండల ప్రజా పరిషత్ బడ్జెట్ సమావేశం ఈ నెల 21న ఉదయం 11.30కు జరుగుతుందని ఎంపీడీఓ కె.హిమమహేశ్వరి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి ఎంపీపీ బొబ్బరాడ సత్తిబాబు అధ్యక్షత వహిస్తారని తెలిపారు. మండలంలోని ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, మండల స్థాయి అధికారులు హాజరు కావాలన్నారు.

మానవాళికి మార్గదర్శి ఏసు క్రీస్తు


కార్యక్రమంలో ప్రసంగిస్తున్న జాన్ మంగాచార్యులు


ఆకట్టుకున్న క్రీస్తు జనన పశువుల పాక

పెద్దాపురం: ప్రతి నెలా ఏజెన్సీ ప్రాంతాల్లో పలు సేవా కార్యక్రమాలతో పాటు, సువార్త దండయాత్ర చేపడుతున్న పెద్దాపురం మండలం తిరుపతి క్రిస్టియన్ గాస్పల్ మినిస్ట్రీస్ (సీజీఎం) 12వ వార్షికోత్సవం, క్రీస్తు శాంతి ప్రార్థనా మందిరం సువార్త సంగీత క్రిస్మస్ వేడుకను మంగళవారం ఘనంగా నిర్వహించారు. సంస్థ ఫౌండర్ ట్రస్టీ నంగిన శామ్యూల్ సుదీప్ ఆధ్వర్యంలో స్థానిక చర్చి సమీపంలో క్రిస్మస్ ఆరాధనను నిర్వహించారు. ఈ సందర్భంగా కృష్ణా జిల్లా పెదలంక ఉజ్జీవ ప్రసంగీకులు, హోలీ టీమ్ డైరెక్టర్ జాన్ మంగాచార్యులు మాట్లాడుతూ, మానవాళికి మార్గదర్శి క్రీస్తు ఏసు ప్రభువేనన్నారు. క్రీస్తు జననం పాపం లేనిదని, పాప క్షమాపణకు ఈ లోకంలో జన్మించి అందరికీ ఆదర్శప్రాయుడుగా నిలిచారన్నారు. క్రీస్తు పరిశుద్ధ ఆచరణలో ప్రతి ఒక్కరూ నడుచుకోవాలాని సూచించారు. అనంతరం క్రీస్తు శాంతి ప్రార్థనా మందిరం దైవ జనులు, సీజీఎం గౌరవాధ్యక్షుడు నంగిన సత్యానందం, శాంతకుమారి దంపతులు, సీజీఎం బృందం వారు భారీ క్రిస్మస్ కేక్‌ను కట్ చేశారు. ప్రముఖ గాయకులు సునీలు, సుజాత, నజరేష్ ఆలపించిన క్రైస్తవ భక్తి గీతాలు ఆకట్టుకున్నాయి. ఏసు జననం పశువుల పాక చూపరులను ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో పాస్టర్లు వంకా జాన్, కాసా అభిషేక్, జయకుమార్, జేమ్స్, బ్లెస్సింగ్, శాంతివర్ధన విభిన్న ప్రతిభావంతుల పాఠశాల డైరెక్టర్ రాయవరపు వీరబాబు, పాస్టరమ్మలు నంగిన శాంతకుమారి, నంగిన ప్రేమలత, విశాల, సుజాత, రూత్ ప్రశాంతి తదితరులు పాల్గొన్నారు.,

టిడ్కో సమస్యలను పరిష్కరిస్తాం

- సంస్థ చైర్మన్ అజయ్‌కుమార్
- ఇబ్బందులను ఏకరువు పెట్టిన లబ్ధిదారులు


టిడ్కో చైర్మన్‌కు సమస్యలు వివరిస్తున్న లబ్ధిదారులు

సామర్లకోట: పట్టణంలోని టిడ్కో ఇళ్ల సముదాయంలో నెలకొన్న సమస్యలను పరిష్కరిస్తామని సంస్థ చైర్మన్ వేములపాటి అజయ్‌కుమార్ అన్నారు. మంగళవారం పట్టణంలోని టిడ్కో ఇళ్ల సముదాయాన్ని ఆయన పరిశీలించారు. ఈ క్రమంలో లబ్ధిదారులు ఆయనను ముట్టడించి, తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఇంటి కోసం రూ.50 వేలు, రూ.లక్షను ఎనిమిదేళ్ల క్రితం చెల్లించడంతో పాటు, బ్యాంకు రుణం రూ.మూడు లక్షలు మంజూరైనా ఇళ్లను లబ్ధిదారులకు అందజేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. దాంతో ఒకవైపు అద్దెలు, మరోవైపు అప్పులకు వడ్డీ చెల్లించాల్సి వస్తోందని మహిళలు విన్నవించారు. తాము నివసిస్తున్న ఇళ్లకు తాగు నీటి సదుపాయం లేదని, తుప్పలు పెరిగిపోవడంతో విష సర్పాలు వస్తున్నాయని, రేషన్ తెచ్చుకోవడానికి ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని తెలిపారు. లబ్ధిదారుల సమస్యలను పరిష్కరిస్తామని అజయ్‌కుమార్ చెప్పారు. ఇందుకు టెక్నికల్, లబ్ధిదారుల గుర్తింపు, ఫైనాన్స్ కమిటీలను ఏర్పాటు చేసినట్టు వెల్లడించారు. టిడ్కో ఇళ్ల సముదాయంలో సీసీ కెమెరాల ఏర్పాటుతో పాటు, పోలీసు బందోబస్తు ఏర్పాటు చేస్తామని చెప్పారు. అనేక ఇళ్లకు విద్యుత్ సరఫరా లేదని, కిటికీలు, తలుపులు పగులగొట్టి ఇళ్లలో చోరీలకు పాల్పడినట్టు గుర్తించామన్నారు. తుప్పల తొలగింపుతో పాటు, మౌలిక సదుపాయాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు. లబ్ధిదారులపై భారం పడకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఆయన వెంట కౌడా చైర్మన్ తుమ్మల బాబు, మున్సిపల్ మాజీ చైర్మన్ రాజా సూరిబాబురాజు, వైస్ చైర్మన్ యార్లగడ్డ చిన్ని, ఆస్పత్రి అభివృద్ధి కమిటీ మాజీ చైర్మన్ అడబాల కుమారస్వామి, గౌడ కార్పొరేషన్ డైరెక్టర్ బడుగు శ్రీకాంత్, కౌన్సిలర్ బలుసు వాసు, పిట్టా జానకిరామారావు, పెంకే వెంకటలక్ష్మి తదితరులు ఉన్నారు.

అర్హులందరికీ టిడ్కో గృహాలు

పెద్దాపురం: అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ టిడ్కో గృహాలు అందుతాయని సంస్థ చైర్మన్ వేములపాటి అజయ్‌కుమార్ అన్నారు. స్థానిక వాలుతిమ్మాపురంలో టిడ్కో గృహ సముదాయాన్ని మంగళవారం మున్సిపల్ మాజీ చైర్మన్ రాజా సూరిబాబు, కౌడా చైర్మన్ తుమ్మల రామస్వామితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా అజయ్‌కుమార్ మాట్లాడుతూ, టిడ్కో గృహ సముదాయాల వద్ద నూరు శాతం మౌలిక వసతుల కల్పన చేపడతామన్నారు. అనంతరం గృహ సముదాయాన్ని పరిశీలించి, అక్కడి ప్రజల సమస్యలను తెలుసుకున్నారు.

పెన్షనర్లు రాయితీలు పొందేలా చర్యలు


పెద్దాపురంలో సీనియర్ పెన్షనర్‌ను సత్కరిస్తున్న పెన్షనర్లు


సామర్లకోటలో మాట్లాడుతున్న తహసీల్దార్ కొవ్వూరి

పెద్దాపురం: మున్సిపాలిటీల్లో పెన్షనర్లకు అన్ని రాయితీలు కల్పించేలా చర్యలు చేపడతామని పెద్దాపురం సబ్ ట్రెజరీ అధికారి ఎ.కాశీకృష్ణ అన్నారు. పెన్షనర్స్ డే సందర్భంగా మంగళవారం స్థానిక పెన్షనర్స్ అసోసియేషన్ భవనంలో నిర్వహించిన సమావేశంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. సంఘ అధ్యక్షుడు శ్యామ్ సుధాకర్ అధ్యక్షత వహించారు. కాశీకృష్ణ మాట్లాడుతూ, పెన్షనర్లకు మున్సిపల్ సేవల్లో ప్రాధాన్యమిచ్చి, అన్ని రాయితీలు కల్పించి సహకరిస్తామన్నారు. బ్యాంకు లావాదేవీల్లో పెన్షనర్ల ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేయాలన్నారు. పెన్షనర్ల అన్ని బిల్లులను సకాలంలో అందజేసి, మెరుగైన సేవలందించేందుకు అధికారులు కృషి చేయాలని కోరారు. అనంతరం 15 మంది సీనియర్ పెన్షనర్లను సన్మానించారు.

రిటైర్మెంట్‌తో కొత్త జీవితం ప్రారంభం

సామర్లకోట: ఉద్యోగులు పదవీ విరమణ తరువాత కొత్త జీవితం ప్రారంభమవుతుందని తహసీల్దార్ కొవ్వూరి చంద్రశేఖరరెడ్డి అన్నారు. పెన్షనర్స్ డే సందర్భంగా స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో మంగళవారం జరిగిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. పదవీ విరమణ చేసిన పట్టణ ప్రభుత్వ ఉద్యోగులు సంఘాన్ని ఏర్పాటు చేసుకున్నారు. పెన్షనర్ల పితామహుడు ధరమ్ సరూప్ నకారా చిత్రపటానికి నివాళులర్పించారు. తహసీల్దార్ మాట్లాడుతూ, విశ్రాంత ఉద్యోగుల సమస్యలను పరిష్కరించడానికి సహకరిస్తానని హామీ ఇచ్చారు. మున్సిపల్ కమిషనర్ ఎ.శ్రీవిద్య మాట్లాడుతూ, పెన్షనర్ల సంఘానికి స్థల కేటాయింపుతో పాటు, మున్సిపాలిటీ పరిధిలో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. అసిస్టెంట్ ట్రెజరీ అధికారి కాశీకృష్ణ మాట్లాడుతూ పెన్షనర్లకు సహకరిస్తానని తెలిపారు. ఈ సందర్భంగా అతిథులతో పాటు, ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ లీలాశ్రీదేవిని సత్కరించారు. నూతన సంఘానికి అధ్యక్షునిగా ఆర్ పల్లేశ్వరరావు, కార్యదర్శిగా జీవీ రాఘవ, కోశాధికారిగా ఎండీవీ ప్రసాద్, ఉపాధ్యక్షునిగా సిద్దా సత్యనారాయణ, ముఖ్య కార్యవర్గ సభ్యులుగా నాయుడు, కెనడీ ఎంపికయ్యారు.

ఘనంగా 108 యజ్ఞాలు


కార్యక్రమంలో ప్రసంగిస్తున్న గురుస్వామి


108 యజ్ఞాల్లో పాల్గొన్న భక్తులు

పెద్దాపురం: మండలంలోని గుడివాడ కృష్ణాశ్రమ వార్షిక వేడుకలు మంగళవారం ఘనంగా ముగిశాయి. ఆశ్రమ గురువు గవరసాని గోపాలకృష్ణమూర్తి ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు నిర్వహించిన వేడుకల్లో భాగంగా శోభాయాత్రతో పాటు, 108 మంది దంపతులతో 108 యజ్ఞాలు, యాగాలు, ప్రత్యేక పూజలు, నిర్వహించారు. అనంతరం భారీ అన్న సమారాధన జరిగింది. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కనపర్తి చీమదొరతో పాటు, కాండ్రకోట, గుడివాడ, సిరివాడ, ఉలిమేశ్వరం, పులిమేరు తదితర గ్రామాల భక్తులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలను తిప్పికొట్టాలి


పోలీసు స్టేషన్‌లో రికార్డులు పరిశీలిస్తున్న ఎస్పీ విక్రాంత్ పాటిల్

- జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్
- గొల్లప్రోలు పోలీసు స్టేషన్ తనిఖీ

పిఠాపురం: సైబర్ నేరాలపై అవగాహన పెంచుకొని వాటిని తిప్పికొట్టాలని జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ సూచించారు. వార్షిక తనిఖీల్లో భాగంగా గొల్లప్రోలు పోలీస్ స్టేషన్‌ను కాకినాడ జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ మంగళవారం తనిఖీ చేశారు. ఈ తనిఖీల్లో భాగంగా పోలీస్ స్టేషన్ పరిసరాలను, భవనాలను పరిశీలించిన ఆయన సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గంజాయి రవాణా వినియోగంపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి గంజాయి కట్టడికి చర్యలు తీసుకోవాలని సూచించారు. అయామ్ సైబర్ అవేర్ కార్యక్రమం ద్వారా అన్ని విద్యా సంస్థల్లో, గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు చేపట్టి, సైబర్ నేరాలపై అవగాహన కల్పించాలని ఆదేశించారు. డిజిటల్ అరెస్ట్ అనేది లేనే లేదని ఈ విధంగా ఎవరైనా బెదిరిస్తే తక్షణమే దగ్గరలో ఉన్న పోలీసు స్టేషన్‌కు సమాచారం అందించాలని, డిజిటల్ అరెస్టుకు భయపడాల్సిన అవసరం లేదన్నారు. మహిళా రక్షక్ కార్యక్రమాన్ని విస్తృతంగా నిర్వహించి, మహిళా చట్టాలు, మహిళల స్వీయ భద్రతకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, గుడ్ టచ్, బ్యాడ్ టచ్ తదితర అంశాలపై అవగాహన కల్పించాలన్నారు. జాతీయ రహదారిపై రోడ్డు ప్రమాదాల నియంత్రణకు పటిష్ట కార్యాచరణతో ముందుకు సాగాలని, బ్లాక్ స్పాట్స్ గుర్తించడం, డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహణ ర్వహించడం తదితర కార్యక్రమాలు చేపట్టి రోడ్డు ప్రమాదాల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని సూచించారు. పోలీస్ స్టేషన్‌కు సంబంధించిన వివిధ రికార్డులను పరిశీలించి, ఎస్సైకి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో పిఠాపురం సీఐ జి.శ్రీనివాస్, గొల్లప్రోలు ఎస్సై రామకృష్ణ, పోలీస్ స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

పేదరిక నిర్మూలనకు సుస్థిర లక్ష్యాలు

- ఎంపీడీఓ హిమమహేశ్వరి
- సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులకు రెండు రోజుల శిక్షణ


శిక్షణకు హాజరైన సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు


సామర్లకోటలో జరిగిన కార్యక్రమంలో అవగాహన కల్పిస్తున్న ఎంపీడీఓ

సామర్లకోట: బహుముఖ రంగాల్లో 2030 నాటికి పేదరికాన్ని రూపుమాపడానికి కేంద్ర ప్రభుత్వం సుస్థిర లక్ష్యాలను నిర్దేశించిందని ఎంపీడీఓ కె.హిమమహేశ్వరి అన్నారు. మండలంలోని సర్పంచ్‌లు, గ్రేడ్ 1 నుంచి ఆరు వరకున్న పంచాయతీ కార్యదర్శులకు రెండు రోజుల శిక్షణను మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ప్రకృతి వైపరీత్యాల కారణంగా మానవాళి భవిష్యత్తుకు ఆటంకం కలగడంతో కేంద్ర ప్రభుత్వం సుస్థిరాభివృద్ధి లక్ష్యాలను ప్రతి గ్రామంలోను అమలు జరిగేలా ఆదేశించిందన్నారు. ఆహారం, తాగునీరు, మంచి సమాజాలు, వనరులు, మహిళాభివృద్ధి వంటి అంశాలపై దృష్టి సారించాల్సి ఉందన్నారు. పర్యావరణ నష్టాలను నివారించకపోతే సుస్థిరాభివృద్ధి లక్ష్యాలు సాధించడం కష్టమని హెచ్చరించారు. గ్రామంలోని ప్రతి వ్యక్తిపై తప్పనిసరిగా శ్రద్ధ చూపాలన్నారు. బీపీఎల్ వర్గాల వారి జీవన ప్రమాణాలను మెరుగుపర్చడం లక్ష్యమని చెప్పారు. అందరికీ సామాజిక రక్షణ పథకాలను అమలు చేయడం, భరోసా ఇవ్వడం, ఐసీడీఎస్ ద్వారా పిల్లలు, గర్భిణుల నమోదు సులభతరం చేయడం, ఉపాధి హామీ పథకం ద్వారా పేదరికాన్ని తగ్గించడం, విభిన్న ప్రతిభావంతులకు మౌలిక సదుపాయాల కల్పనపై దృష్టి సారించాలన్నారు. ఈ మేరకు వీటిని అమలు చేయడానికి ప్రజల భాగస్వామ్యంతో గ్రామ సభలు నిర్వహించాలన్నారు. ప్రధానమంత్రి శ్రమ యోగి మాన్‌ధన్‌ను పంచాయతీ స్థాయిలో అందుబాటులోకి తేవాలన్నారు. ఎంపీపీ బొబ్బరాడ సత్తిబాబు మాట్లాడుతూ, శిక్షణలో అంశాలను పంచాయతీ కార్యదర్శులు అవగతం చేసుకుని అమలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఈఓపీఆర్డీ భైరవమూర్తి, సీడీపీఓ జి.ఉషా, మండల ఇంజినీరింగ్ అధికారి కె.శ్రీనివాసరావు, మాస్టర్ ట్రైనర్లు కె.శ్రీనివాసరావు, బి.సుభాషిణి, ఎ.సుభాషిణి, పి.వుల్లయ్య పాల్గొన్నారు.

అభివృద్ధే లక్ష్యంగా పని చేయాలి


కొత్తపల్లిలో శిక్షణలో మాట్లాడుతున్న ఎంపీడీవో రవికుమార్

కొత్తపల్లి: గ్రామ పంచాయతీలో పనిచేసే అన్ని శాఖల అధికారులు పంచాయతీల అభివృద్ధి లక్ష్యంగా పనిచేయాలని ఎంపీడీవో రవికుమార్ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం గ్రామ పంచాయతీల అభివృద్ధిపై గ్రామ సర్పంచులకు, సచివాలయ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. మహాత్మా గాంధీ, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఈఓపీఆర్డీ కర్రి హరికష్ణ సత్యరెడ్డి, ఐసీడీఎస్ కొత్తపల్లి సెక్టార్ సూపర్వైజర్ అనంతలక్ష్మీ, ఏఓ వాడ్రేవు చలమయ్య, పంచాయతీ కార్యదర్శులు శ్రీనివాస్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.